క్లుప్తంగా

సీఎంకు ఆర్‌యూపీపీటీజీ కృతజ్ఞతలు

జనగామ: జిల్లాలో భాషా పండితుల అప్ గ్రేడేషన్ తర్వాత మిగిలిపోయిన హిందీ, తెలుగు పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా పక్షాన మంగళవారం అధ్యక్షుడు బీటుకూరు శేషుకుమార్, ప్రధాన కార్యదర్శి గుర్జకుంట స్వరాజ్ కృతజ్ఞతలు చెప్పారు. అదేవిధంగా 2024 డీఎస్సీ ద్వారా నియామకమైన భాషా పండితులను అప్ గ్రేడేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్ళపల్లి తిరుమల, కాంతి కృష్ణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

గోవర్ధనగిరిలో డీఎల్‌పీఓ విచారణ

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ వెంకట్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. గ్రామంలో అక్రమంగా నిర్మాణాలు చేశారని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రఘునాథపల్లికి చెందిన ఠాకూర్ గ్యానేష్‌సింగ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీఓ గ్రామ పంచాయతీలో విచారణ చేపట్టారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నాయా..? అని పంచాయతీ కార్యదర్శి త్రివేణిని అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఇనాం భూములలో రియల్టర్లు లేఅవుట్ చేశారని, మా భూములు అక్రమిస్తున్నారని పలువురు స్థానికులు జీపీకి చేరుకుని డీఎల్‌పీఓను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో డీఎల్‌పీఓ బాధితులతో కలిసి లే అవుట్‌ను పరిశీలించి ఆరా తీశారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటానని డీఎల్‌పీఓ తెలిపినట్లుగా బాధితులు తెలిపారు.

అభినందనలు

చిల్పూరు: షూటింగ్‌బాల్, అథ్లెటిక్స్ పోటీల్లో పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్లు సాధించారు. కాగా, మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హెచ్‌ఎం కోమళి, ఫిజికల్ డైరెక్టర్ దేవ్‌సింగ్‌లు అభినందించారు. బీహార్‌లోని గయాలో జరిగిన జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలో కోల సాయిప్రియ సర్టిఫికెట్, సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జీడీ ప్రీతి, ఆర్యలు బంగారు పతకాలు సాధించారు.

వీరభద్రుని జయంతి వేడుకలు

పాలకుర్తి: పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో పోతన సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో వీరభద్రుని జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. మంగళవారం బీరభద్రుని జయంతి పురస్కరించుకుని పోతన చిత్రపటానికి పూలమాల వేసి కమిటీ బాధ్యులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పోతన కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్, ప్రధాన కార్యదర్శి దేవసాని ఉపేందర్, కళ్లెం నర్సింహులు, దేవసాని నరేష్, సోమ సాయి, బత్తిని రవి, మాడరాజు సోమయ్య, భార్గవ్, అఖిల్, అనిల్‌లు తదితరురులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్న కడియం

● మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి 74 ఏళ్ల వయస్సులో మతితప్పినట్లు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ అరెస్టులు, నకిలీ ఎన్‌కౌంటర్లకు శ్రీహరి స్పెషలిస్టు అని అన్నారు. ఒకసారి తాను ఏపార్టీలో ఉండాలో అదే పార్టీలో ఉన్నానని, ఇటీవల ధర్మసాగర్‌లో కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని చెప్పారని ఎద్దేవా చేశారు. ఓర్వలేనితనం, అహం ఆయన మ్యానరిజమని విమర్శించారు. ఉమ్మడి జిల్లాకు స్టార్‌లీడర్‌గా చెప్పుకునే ఆయన మార్కు అభివృద్ధి ఎక్కడా లేదన్నారు. ఇప్పటికైనా కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికల్లోకి రావాలని ఆయన సవాల్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలి

జనగామ రూరల్: భూ భారతి ద్వారా సాగులో ఉన్న భూములన్నిటికీ ఫీల్డ్ సర్వే నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు కోరారు. మంగళవారం పట్టణ కార్యదర్శి మంగ భీరయ్య అధ్యక్షతన తహసీల్ వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

29 నుంచి గ్రామాల్లో సర్వే

చిల్పూరు: ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 17వ తేదీ వరకు మండలంలోని గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై సర్వే చేపట్టడం జరుగుతుందని మండల కార్యదర్శి సాదం రమేశ్ తెలిపారు. కృష్ణాజీగూడెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.


స్టేషన్‌ఘన్‌పూర్: మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డీపీఓ, ఆర్డీఓ


తరిగొప్పుల: గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి (ఫైల్)


జనగామ: సెయింట్ మేరీస్ స్కూల్‌లో హెచ్‌ఎం మరియు జోసఫ్ ఆధ్వర్యంలో..


చిల్పూరు: మండపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడు

మట్టి గణపతులను పూజించాలి

● డీపీఓ స్వరూపారాణి

స్టేషన్‌ఘన్‌పూర్: మట్టి గణపతులను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతుగా కృషి చేయాలని డీపీఓ స్వరూపారాణి, ఆర్డీఓ డీఎస్ వెంకన్న అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళా సంఘాలకు మున్సి పాలిటీ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అష్టదళ పాద పద్మారాధన పూజను అర్చకుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో అర్చకులు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

గణపతి సంబురాలు

దేవరుప్పుల: మండలంలోని మాదాపురం ప్రాథమిక పాఠశాలలో గణేశ్ నవరాత్రోత్సవాలు పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులచే మట్టితో విగ్రహాలు చేయించి ముందస్తు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నల్ల లలిత, ఉపాధ్యాయులు సుజిత్, జీవన్, నర్సయ్య, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుర్తిటౌన్: పర్యావరణ హితంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని సోమేశ్వర ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు కోరారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు.


జనగామ: ఎస్‌పీఆర్ స్కూల్ కరస్పాండెంట్ కీర్తి వీరేందర్ ఆధ్వర్యంలో..


జనగామ: వీవర్స్ కాలనీ భజరంగ్ దళ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


చిల్పూరు: మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఈఓ, చైర్మన్

మట్టి వినాయకులను పూజించాలి

బచ్చన్నపేట: పర్యావరణాన్ని రక్షించడానికి అందరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని కొడవటూర్ దేవస్థాన ఈఓ చిందం వంశీ అన్నారు. ఆలయ ఆవరణలో ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయతో కలిసి మట్టి వినాయకులను పంపిణీ చేశారు.

15 ఏళ్లుగా..

తరిగొప్పుల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మండలకేంద్రంలో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తున్నారు. గణపతిని ప్రతిష్ఠించిన నాటి నుంచి కంకణబద్ధులై ఎంతో నిష్ఠతో పూజిస్తారు.

13 ఏళ్లుగా..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో వాసవీగణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత 13 ఏళ్లుగా మట్టి గణపతి విగ్రహాలతో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూక సందీప్, పార్శి సాయినాథ్ మాట్లాడుతూ పర్యావరణ హితమే లక్ష్యంగా మట్టి గణపతిని పూజిస్తున్నట్లు తెలిపారు.

ఐదేళ్లుగా..

చిల్పూరు: మండల కేంద్రంలోని జీపీ సమీపంలో ఐదేళ్లుగా మట్టి వినాయకుడికే పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన ఊట్కూరి సునయ్ మండపంలో మట్టి గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ఇళ్లలో పూజించేందుకు మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

పెద్దమడూరులో..

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరు హైస్కూల్‌లో నేషనల్ గ్రీన్ క్రాప్స్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ హిత గణపతులను విద్యార్థులచే తయారు చేయించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డి.అశోక్ మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తే ప్రాణవాయువు కలుషితం అవుతాయన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పోచమ్మ వీధిలో, శివాలయం వీధిలో గత కొన్నేళ్లుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా ప్రతిష్ఠిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.


స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో మట్టి గణపతిని పూజిస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు(


బచ్చన్నపేట: శివాలయం వీధిలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడు (ఫైల్)


పాలకుర్తిటౌన్: మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు


దేవరుప్పుల: వినాయకుడికి పూజ చేస్తున్న విద్యార్థులు

కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

● డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

జనగామ రూరల్: తక్కువ వేతనంతో ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జనగామ, లింగాల ఘనపూర్, బచన్నపేట పాఠశాల, కేజీబీవీ, మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎండీ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఇప్ప రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య, ఎండీ అప్సర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సోమయ్య

అనుమతిలేని ఔషధాల సీజ్

పాలకుర్తిటౌన్/పాలకుర్తి: అనుమతి లేకుండా నిల్వ చేసిన ఔషధాలను సీజ్ చేసిన ఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. వావిలాల గ్రామంలో అనుమతి, అర్హత లేకుండా ఓ వ్యక్తి క్లినిక్‌ను నిర్వహిస్తున్నాడు. దానిలో 35 రకాల అల్లోపతి ఔషధాలను నిల్వ చేశాడు. సమాచారం అందుకున్న డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఏలె బాలకృష్ణ, జన్ను కిరణ్‌లు మంగళవారం గ్రామంలోని ఓ క్లినిక్‌లో తనిఖీ చేపట్టి అనుమతిలేని మందులను సీజ్ చేసి నిర్వాహకునిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. వాటివిలువ సుమారు రూ.20 వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.


క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ అధికారులు

గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆర్డీఓ డీఎస్ వెంకన్న, డీపీఓ స్వరూపరాణి అన్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్ పరిధిలోని సీఐలు, రెవెన్యూ, మండల పరిషత్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సహస్రలో వినాయక నాటక ప్రదర్శన

జనగామ: జిల్లా కేంద్రంలోని సహస్ర కిడ్స్‌లో మంగళవారం చిన్నారులు గణేశ్ నాటక ప్రదర్శనతో అబ్బుర పరిచారు. అనంతరం ప్రిన్సిపాల్ కీర్తి సమత ఆధ్వర్యంలో పిల్లలకు బహుమతులను అందించారు.


నాటక ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

భూ భారతి దరఖాస్తుదారులకు న్యాయం చేయాలి

దేవరుప్పుల: భూసమస్యలపై భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పట్టాదారు పుస్తకాలు లేకుండా సాగుభూమి కబ్జాలో ఉన్న రైతులకు పాసు పుస్తకాలు జారీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు ఆండాళ్‌కు వినతి పత్రం అందజేశారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

రఘునాథపల్లి: జీవకోటికి ప్రాణాదారమైన చెట్ల కోసం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ అన్నారు. వెల్ది మోడల్‌స్కూల్‌లో మంగళవారం వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

జయప్రదం చేయాలి

జనగామ రూరల్: సెప్టెంబర్ 1 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన

స్టేషన్‌ఘన్‌పూర్: తానేదార్‌పల్లి గ్రామంలో తేలిక పాటి వర్షాలకే బురదమయంగా మారుతున్న రోడ్లపై గ్రామస్తులు మంగళవారం నాట్లు నిరసన వ్యక్తం చేశారు. అధికారులు, ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రోడ్ల సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కేసు నమోదు

రఘునాథపల్లి: కంచనపల్లిలో కౌలు రైతు పత్తి చేను ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని లోనె మనోహర్‌కు చెందిన 1-05 గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన సుంచు సుధాకర్ కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశాడు. మనోహర్ భూమితో పాటు పక్కనే ఉన్న అతని సోదరుడు లోనె సుధాకర్‌కు చెందిన 0–20 గుంటల భూమిని కూడా కౌలు రైతు సుంచు సుధాకర్ సాగు చేశాడు. దీంతో వివాదం నెలకొంది. లోనె సుధాకర్, అతని భార్య స్వరూప, వారి కుమారుడు కార్తీక్ కౌలు రైతు సాగు చేసిన పత్తి పంట మొత్తం ధ్వంసం చేశారు. పంట ధ్వంసంతో రూ.50 వేల మేర నష్టపోయినట్లు బాధిత కౌలు రైతు సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వాగులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి

గుండాల: ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం రామచంద్రగూడెం గ్రామానికి చెందిన చిర్ర బాలరాజు(55) కొంతకాలంగా హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాలరాజు తన అత్తగారి ఊరైన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామంలో మైసమ్మ పండుగకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి బస్సులో బయల్దేరి మోత్కూరులో దిగాడు. అక్కడి నుంచి పారుపల్లి గ్రామంలోని తన అత్తగారి వ్యవసాయ బావి వద్దకు వెళ్లేందుకు ఆత్మకూరు(ఎం) మండలం మోదుబావిగూడెం, గుండాల మండలం అంబాల గ్రామ శివారులోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు వాగులో జారిపడి కొట్టుకుపోయాడు. మంగళవారం అంబాల శివారులో బిక్కేరు వాగు ఒడ్డున బాలరాజు మృతదేహాన్ని స్థానిక రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తేజమ్‌రెడ్డి తెలిపారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

జనగామ: జిల్లా కేంద్రం సిద్దిపేటరోడ్డు డీసీసీ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ ఎస్కార్టు వాహనం ఢీకొని ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కలెక్టర్ తరిగొప్పుల పర్యటన ముగించుకుని ఎస్కార్టు వాహనంతో తిరిగి బయలుదేరారు. ఇదే సమయంలో జనగామ మండలం పెద్దరామన్ చర్లకు చెందిన నాయిని భిక్షపతి డివైడర్ పక్క నుంచి రోడ్డు దాటే క్రమంలో ముందుగా కలెక్టర్ వాహనం వెళ్లగా, వెనక ఉన్న ఎస్కార్టు కారు ఢీ కొట్టింది. భిక్షపతి తలతో పాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి వెళ్లాడు. వెంటనే జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి, హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ యశోదలో వైద్యం అందిస్తున్నారు.

టోల్ రోడ్డు నిర్వహణ షురూ

దేవరుప్పుల: జనగామ–సూర్యాపేట రహదారి ఆరేళ్ల కిందట టోల్ రోడ్డు నిర్వహణలోకి వచ్చినా కనీస మరమ్మతులు ఎరుగని తరుణంలో మంగళవారం ఓ కాంట్రాక్టర్ పర్యవేక్షణలో మరమ్మతులు పనులు ప్రారంభమయ్యాయి. దేవరుప్పుల, కామారెడ్డిగూడెం పరిధి రహదారి ఇరువైపుల పరిశుభ్రంగా ఉండేలా నిల్వ ఉన్న వ్యర్థ మట్టి, ఇసుక తదితర వస్తువులను తొలగించారు. త్వరలో రహదారి ఇరువైపులాఉన్న రేయిలింగ్(రక్షణ ఇనుప కడ్డీలు) తొలగించకుండా శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్యానికి ఎమ్మెల్యే సాయం

చిల్పూరు: మల్కాపూర్ గ్రామానికి చెందిన దామెర లక్ష్మయ్య అనారోగ్యానికి గురయ్యాడు. కాగా, చికిత్స చేయించుకునే స్థోమత లేక పోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు యాదగిరి, మాధవరెడ్డి, రవిలు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన నీలిమ ఆస్పత్రిలో రూ. 50 వేల ఖర్చుతో చికిత్స చేయించారు. కాగా, మంగళవారం రాకేష్‌రెడ్డి తదితరులు బాధితుడిని పరామర్శించారు.

పరామర్శ

పాలకుర్తి/దేవరుప్పుల: పలు గ్రామాల్లో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంగళవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేరు. ఆమె వెంట నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: కామారెడ్డిగూడేనికి చెందిన దండు కొండయ్య మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ మండల నాయకుడు యేల సుందర్ పరామర్శించి రూ.5వేల సాయం అందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

సాక్షి నెట్‌వర్క్: గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసీల్దార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి గుండె విజయరామారావు, జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

స్థిరమైన వ్యవసాయానికి 'నానో యూరియా'

కొడకండ్ల: స్థిరమైన వ్యవసాయానికి నానో యూరియా ఒక విప్లవాత్మక పరిష్కారమని, ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ పంట దిగుబడిని పెంచుతూ పర్యావరణాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్సింగాపురం గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎఈఓ సరిత, కోరమండల్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.